క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



వల్లూరు గ్రామ కూడలిలోని చలివేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి సుభాకర్

కపిలేశ్వరపురం: ప్రభుత్వాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సచివాలయాలు, గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద వాటిని ఏర్పాటు చేశారు. ఎండ వేడి నుంచి ప్రజలకు ఉపశమనం కోసం చల్లని మంచి నీరును ఏర్పాటు చేశారు. చలివేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, నల్లూరు, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, కాలేరు, అచ్యుతాపురం, టేకి, మాచర, కోరుమిల్లి, నాగుల చెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీడీఓ ఎం.కొండలరావు కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అనంతరం స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండల కేంద్రమైన సత్యవాడలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి నూతన ఆలయంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు బిక్కవోలు కేశవాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం నుంచి ఆలయం వద్ద పలు ప్రత్యేక పూజలు, గోమాత దర్శనం, ప్రతిష్ఠ, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదానంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లొల్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సాంకేతిక నిపుణులు

రాయవరం: విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం నుంచి వచ్చిన సాంకేతిక వైద్య నిపుణులు సుబ్రహ్మణ్యం, సురేంద్ర, కొండలరావు, విజయ సునందలు రోగులకు వైద్య సేవలు అందించారు. లొల్ల పరిసర గ్రామాలకు చెందిన 95 మంది వైద్య సేవలు పొందారు. 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, విశ్వ మానవత సంస్థ ప్రతినిధి కర్రి సుజాత, స్థానికులు పాల్గొన్నారు.

ఎస్టీవోకు వీడ్కోలు సత్కారం



సబ్ ట్రెజరీ అధికారి కరీమ్ సత్కార సభలో మాట్లాడుతున్న తహసీల్దారు కృష్ణారావు

రాయవరం: పదవీ విరమణ చేసిన రాయవరం ఉప ఖజానా అధికారి ఎండీ అబ్దుల్ కరీమ్‌కు బుధవారం ఘన సత్కారం చేశారు. గత నెల 31న పదవీ విరమణ చేసిన ఉప ఖజానా అధికారికి సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఆర్వీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అన్నారు. అయితే ఆ ఉద్యోగి తన సర్వీసులో ప్రజలకు అందించిన సేవలు మాత్రం కలకాలం గుర్తుండిపోతాయన్నారు.తన వద్దకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు ప్రతి ఉద్యోగీ సేవలు అందించాలన్నారు. అనంతరం కరీమ్‌ను సిబ్బంది దుశ్శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పంపన రామారావు, రెవెన్యూ, ఖజానా సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలి

మండపేట: నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నందున వెంటనే సాగునీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన మండలంలోని కేశవరం గ్రామం పర్యటించినపుడు నీటి ఎద్దడి సమస్యను అక్కడి రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఎమ్మెల్యే జోగేశ్వరరావు ఇరిగేషన్ డీఈతో ఫోన్లో మాట్లాడి రైతులకు సకాలంలో నీరందించేలా చూడాలని కోరారు.

అప్రమత్తత ఎంతో ప్రధానం

- రాత్రి మంచు, పగలు ఎండ
- నిర్లక్ష్యం వహిస్తే ముప్పు



డాక్టర్ ఎస్ ప్రవీణ్‌కుమార్
ఏరియా ఆసుపత్రి
రామచంద్రపురం



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రామచంద్రపురం ప్రధాన రహదారి



ఉదయం 7 గంటల సమయంలో కురుస్తున్న మంచు

రామచంద్రపురం: వాతావరణం మారుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తత ఎంతో ప్రధానం. నిన్న మొన్నటి వరకు శీతాకాలం నుంచి వేసవి ప్రారంభ సమయంలోనే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అమాతంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటివారంలోనే ఎండలు పెరుగుతున్నా రాత్రి వేళలో కురిచే మంచు ఉదయం 8 గంటల వరకు ఉంటుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచే ఎండ అధికంగా ఉండటంతో ప్రజలకు ఇళ్లకే పరిమితయ్యారు. సాయంత్రం 5.30 గంటల వరకు వేడిమి వాతావరణమే ఉంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయాన్నే మంచు తరువాత ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా(విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతూ దగ్గు, రొంప, గొంతు నొప్పులతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఎండ వేడిమి పెరగడంతో ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే అవకాశం అధికంగా ఉంది. ఉదయం పూట మంచులో తిరిగిన వారికి గొంతు నొప్పి, జలుబు వ్యాధుల పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ విధంగా రాబోయే కాలంలో పెరుగుతున్న ఎండల కారణంగా జ్వరాల బారిన పడకుండా, వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ వివరిస్తున్నారు.

ఎండలో అధికంగా పని చేయరాదు

ప్రజలు వేసవిలో వీలైనంతగా పనిచేయకుండా ఉండటం మంచిది. ఉదయం సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువసేపు పనిచేస్తే చర్మం పొడి బారటం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను చల్లని ప్రాంతంలో ఉంచి చల్లనిగాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడిగుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించాలి.

- వేసవిలో చేయకూడని పనులివే..
- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం సేవించరాదు.
- రోడ్ల మీద చల్లని రంగు పానీయాలు తాగరాదు
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు
- వేసవిలో మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు

వేసవిలో చేయాల్సిన పనులు:

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీటితో పాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులను ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లవలసి వస్తే గొడుగు, టోపీలను తీసుకెళ్లాలి.
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి

వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకు ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలపిన మజ్జిగను తాగించాలి. లేని పక్షంలో గ్లూకోజ్ ద్రావణం తాగించాలి
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వడదెబ్బ తగిలితే వీలైంత త్వరగా ఆసుపత్రికి తరలించాలి

వడదెబ్బపై అవగాహన ఉండాలి



నల్లూరులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: వడదెబ్బ ప్రభావంపై అందరికీ అవగాహన ఉండాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, కపిలేశ్వరపురం, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నల్లూరు, వడ్లమూరు, వెదురుమూడి, నిడసనమెట్ట, అచ్యుతాపురం, కాలేరు గ్రామాల సచివాలయాలు వద్ద బుధవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎండ ప్రభావానికి గురవకుండా తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలు సూచించారు. రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల సురక్షిత మంచినీరును తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, ఎల్‌టీ ఆలీ, సిబ్బంది తాతపూడి మేరీ, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం



కాజులూరు చాకిరేవుమెరకలో జరిగిన సభలో మాట్లాడుతున్న రామచంద్రపురం మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యం లభిస్తోందని వైఎస్సార్ సీపీ నేత, రామచంద్రపురం మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు బీసీ నాయకులు బుధవారం మండల గ్రామాల్లోని బీసీ పేటల్లో పర్యటించి రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాల్సిందిగా బీసీ పెద్దలను కోరారు. కాజులూరు శివారు చాకిరేవుమెరకలో మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీసీలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారే తప్ప ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. సీఎం జగనన్న బీసీ నేతలైన పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్య తదితరులకు రాజ్యసభ పదవులు, పలువురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారని ప్రస్తుత ఎన్నికల్లోనూ బీసీలకు 40 శాతం సీట్లు కేటాయించి బీసీలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. జగనన్న తమ వర్గానికి చేస్తున్న మేలు మరువకూడదని రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఫ్యాను గుర్తుకే ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెంకే భీమన్న, ఇల్లా సూర్యనారాయణ, కొప్పుశెట్టి ఏడుకొండలు, పంపన శ్రీను, దొమ్మేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి టీడీపీలో ఉదయం వైఎస్సార్ సీపీలో..





టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మణికంఠ

మండపేట: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీల్లో చేరికల విషయంలో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఏరోజున ఎవరెవరు ఏయే పార్టీల్లో ఉంటున్నారో తెలియడం లేదు. నిన్న ఒక పార్టీ కండువా కప్పుకుని కనిపిస్తుంటే మరుసటి రోజున మరో పార్టీ కండువాతో కనిపించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మండలంలోని కేశవరంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీలోకి ఆకుల మణికంఠ అనే కార్యకర్తకు ఆ పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. తెల్లారేసరికి మణికంఠ ఆ పార్టీకి బైబై చెప్పి వైఎస్సార్ సీపీలో జాయిన్ అయ్యాడు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి అద్దంకి రమణ సమక్షంలో బుధవారం తిరిగి ఆ పార్టీలో చేరారు.

5న మండపేటలో కాపుల ఆత్మీయ సమావేశం



విలేకరుల సమావేశంలో కాపు సంఘ అధ్యక్షుడు సాయిబాబా తదితరులు

మండపేట: పట్టణ కాపుల ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు స్థానిక సంగిత వెంకటరెడ్డి నగర్‌లోని జొన్నల శేషాయమ్మ, అబ్బులు కాపు కల్యాణ మండపంలో నిర్వహిస్తారు. ఈ విషయాన్ని బుధవారం అదే కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండపేట కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా చెప్పారు. కాపు సంఘ నాయకులు సిద్ధిరెడ్డి సూర్యారావు, మెండు బాపిరాజు, యాళ్ల శ్రీనివాస్, దూలం చక్రవర్తి, పుట్టపూడి సుందరయ్య, కొప్పిరెడ్డి కృష్ణ తదితర నాయకులతో కలిసి సాయిబాబా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ద్వారా కాపు సంఘానికి మేలు జరిగిందన్నారు. తమ విజ్ఞప్తి మేరకు రూ.19 లక్షల వ్యయంతో కాపు కల్యాణ మండపానికి ఎమ్మెల్సీ తోట రోడ్డు వేయించారన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా మండపేటలో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న కాపుల చిరకాల వాంఛను ఎమ్మెల్సీ తోట నెరవేర్చారన్నారు. ఆయన మున్సిపల్ కౌన్సిల్‌ను ఒప్పించి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయంలో సహకరించిన మండపేట మున్సిపల్ కౌన్సిల్‌కు కాపు సంఘం తరపున సాయిబాబా కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నాటి సమావేశానికి పట్టణంలోని కాపులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాపు నాయకులు గోకరకొండ సుబ్బారావు, వంగా సత్తిబాబు, దూలం నాగు, సీతిని సూరిబాబు, సాధనాల శివభగవాన్, ఈలి తాతాజీ, గోకరకొండ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించి వాటిని వారు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఆర్‌బీకే సిబ్బంది కృషి చేయాలని మండల తహసీల్దారు ఎ.శాంతిలక్ష్మి అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బందికి కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీ నుంచి మండల గ్రామాల్లోని 21 ఆర్బీకేల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందన్నారు. సాధారణ రకం 75 కేజీల ధాన్యం బస్తా రూ.1637 గానూ, గ్రేడ్ ఏ రకం 1652 గానూ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలతో పాటు పంట సొమ్ములు 21 రోజుల వ్యవధిలో వారి బ్యాంక్ ఖాతాకు జమచేయడం జరుగుతుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా వారు కొనుగోలు కేంద్రాలు వినియోగించుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో బుధవారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించారు. మూడు నెలల గడువు లోపల సమావేశం నిర్వహించాల్సిన నిబంధన ఉండటం ఒకవైపు, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం మరోవైపు ఉండటంతో ఎటువంటి తీర్మానాలు, చర్చలు లేకుండా సమావేశం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వాంతర్యామి శ్రీకృష్ణుడు

అయినవిల్లి: శ్రీకృష్ణుడు విశ్వాంతర్యామి అని అన్నీ ఆయనకు తెలుసని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాసు ప్రభుజీ అన్నారు. బుధవారం మందిర్ నిర్మాణంలో భాగంగా 9.14 గంటలకు భక్తుల ఆధ్వర్యంలో గుమ్మం ముహూర్తం చేశారు. శ్రీనివాసదాసు ప్రభుజీ ప్రవచిస్తూ.. మనుషుల మనస్తత్వాన్ని బట్టి వర్ణాలను భగవంతునితో నిర్ణయించబడిందన్నారు. అసలు భగవంతుడు చాతుర్వర్ణాలను సృష్టించాడన్నారు. ఇందులో ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు అన్నారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అన్నారు. అనంతరం భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మందిర నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులు, నిర్మాణానికి సహకరించిన దాతలు, పలువురు భక్తులు, సేవకులు పాల్గొన్నారు.



జనవరిలో ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న వలంటీరు



వెంటూరు పంచాయతీ వద్ద బుధవారం పింఛను కోసం లబ్ధిదారుల పడిగాపులు

నాడు అలా.. నేడు ఇలా..

రాయవరం: గత జనవరి నెలలో ఇంటింటికి వెళ్లి వలంటీర్లు పెన్షన్లు అందజేసేవారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి దూరాభారమని భావించకుండా వలంటీర్లు ఆస్పత్రులకు వెళ్లి మరీ అందజేసేవారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం.. వలంటీర్లపై ఆంక్షలు విధించడంతో నేడు పంచాయతీల వద్ద పెన్షనర్లు పింఛన్లు తీసుకోవాల్సి రావడం..తమ వంతు వచ్చే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితికి ఈ చిత్రం దర్పణం పడుతుంది.

యాక్టివాయే ఆయన ప్రచార రథం



తన స్కూటర్‌కు వైఎస్సార్ సీపీ రంగులు వేయించి ప్రచారానికి సిద్ధమైన శ్రీనివాస్ చౌదరి

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రధాన అనుచరుడైన పట్టణానికి చెందిన కొడవటి శ్రీనివాస్ చౌదరి ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున మండపేట నియోజకవర్గమంతా తిరిగి ప్రచారం చేయడానికి రూ.1.05 లక్షల వ్యయంతో హోండా యాక్టివా టూ వీలర్‌ను కొనుగోలు చేశారు. ఆయన అక్కడితో ఊరుకోలేదు. ఈ వాహనంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగులే కాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చిత్రాలను కూడా వేయించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విధంగా రంగులు వేయించడానికే రూ.25 ఖర్చు అయినట్టు యజమాని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. యాక్టివాపై ఫ్యాను గుర్తు కూడా వేయించినట్టు చెప్పారు. అలాగే వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు కూడా ఎన్నికల్లో ప్రచారం కోసం కొత్త వాహనాన్ని కొనుగోలు చేశారు. తమ నాయకుడు జగన్, తోట త్రిమూర్తులు ఫొటోలు, వైఎస్సార్ సీపీ జండాలను ఆ వాహనంపై స్టిక్కరింగ్ చేయించారు. నాగేశ్వరరావు ఆ వాహనంపై మండపేట నియోజకవర్గంలోని రోజుకో గ్రామంలో పార్టీ జెండాను చేతబూని తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

మంచు కురిసే వేళలో..



పెదపళ్లలో మంచుతో కప్పేసిన వరి పైరు



మండపేట-ఆలమూరు రోడ్డులో మంచు ప్రభావానికి ఫ్లడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న కారు



గుమ్మిలేరులో మంచుతో కప్పబడిన సూర్యుడు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులు, లంక పరీవాహక ప్రాంతాలన్నీ బుధవారం ఉదయం మంచుతో తడిసి ముద్దయ్యాయి. పగలు మండు టెండలు, రాత్రి వేళల్లో ఉక్కపోత ఉంటుండగా తెల్లవారుజాము నుంచి మాత్రం మంచు తీవ్రంగా కురుస్తూ జనజీవనానికి తీవ్ర ఆటంకాన్ని కలిగించే విచిత్ర పరిస్థితి నెలకొంది. దట్టమైన మంచుతో సంతరించుకున్న కొత్త అందాలతో వివిధ ప్రదేశాలు కనువిందు చేశాయి. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న మంచు వల్ల ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు పొరలు వీడలేదు. ఒక దశలో మంచు విపరీతంగా కురియడంతో ఒకరి కొకరు కనబడనంతగా కమ్మేసింది. రోజు మాదిరిగా దైనందిన కార్యక్రమాలకు వెళ్లవలసిన వారంతా వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. వేసవిలో సైతం సూర్యుడు కనిపించనంతగా ఈ మంచు దట్టంగా కురవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మండలంలోని లంక గ్రామాల్లో ఈ మంచు కురుస్తున్న దృశ్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఆలమూరు-మండపేట రోడ్డులో మంచు దుప్పటి తీవ్రంగా కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేగంగా దూసుకెళ్లే వాహనాలన్నీ లైట్లు వేసుకుంటూ 20-30 కి.మీ వేగానికే పరిమితమవడం విశేషం.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కొలువుదీరిన కోదండరామస్వామి వారి ఆలయంలో పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తరాషాఢ నక్షత్ర యుక్త వృషభ లగ్నం 9.14 గంటలకు వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ పాల శిలా విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. దీనిలో భాగంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల వీవీ లక్ష్మీసత్యనారాయణ-శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు-కుమారి, ముత్యాల దుర్గాప్రసాద్-ఉషాదేవి దంపతులు ప్రధాన కర్తలు పాల్గొన్నారు. విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, రత్న్యాసం, పూర్ణాహుతి, గోదృష్టి, శాంతి కల్యాణం, ఆశీర్వచనం, పండిత సత్కారం తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.